సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 5 । మే । 2024

రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని చేవెళ్ల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను శనివారం పూర్తి చేశారు. రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్‌కుమార్ కటారియా సమక్షంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలకు కేటాయించే బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ యంత్రాల ర్యాండమైజేషన్‌ను పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా 25 శాతం అదనంగా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం వీవీ ప్యాట్‌లను రిజర్వ్‌లో ఉంచినట్లు కలెక్టర్ శశాంక ఈ సందర్భంగా తెలిపారు. చేవెళ్ల లోక్‌సభ స్థానం నుంచి 43 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని.. ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు చొప్పున బ్యాలెట్ యూనిట్లను వినియోగించాల్సి ఉందని వెల్లడించారు. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

పోటీలో 43 మంది అభ్యర్థులు

- 2,877 పోలింగ్ కేంద్రాలు
- ఒక్కో సెంటర్‌లో మూడు బ్యాలెట్ యూనిట్లు



ట్యాంక్‌బండ్‌ను తలపిస్తున్న చందన చెరువు

సండే స్పెషల్

ఆహ్లాదపు చందనం

మినీట్యాంక్‌బండ్‌గా చందన చెరువు

- ఆహ్లాదం.. ఆరోగ్యానికి అడ్రస్
- సేదదీరుతున్న పర్యాటకులు
- చిల్డ్రన్స్ పార్క్‌లో పిల్లల సందడి
- షార్ట్ ఫిల్మ్స్, ప్రైవేటు ఆల్బమ్స్, ఫొటో షూట్‌లకు అడ్డాగా మారిన చెరువు

ఆహ్లాదం.. ఆరోగ్యం.. ఆట.. పాట.. ఉల్లాసం.. ఉత్సాహం.. ఫొటో షూట్స్.. షార్ట్ ఫిలిమ్స్.. ప్రైవేటు ఆల్బమ్‌ల షూటింగ్‌లు.. వీకెండ్స్‌లో చిన్నారులకు ఫన్ అందించే చిల్డ్రన్ పార్కు.. వీటన్నింటికీ కేరాఫ్ అయ్యింది మీర్‌పేట కార్పొరేషన్‌లోని చందన చెరువు. రెండేళ్ల క్రితం రూ.5.50 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో సుందరీకరించారు. నిత్యం ఎంతోమంది సేద తీరుతూ సందడి చేస్తున్నారు.

- మీర్‌పేట

చందన చెరువు సుందరీకరణలో భాగంగా వాకింగ్, జాగింగ్‌కు అనువుగా చెరువు చుట్టూ 1.6 కిలో మీటర్ల మేర వాక్‌వే నిర్మించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ చేయడానికి అధిక సంఖ్యలో వస్తుంటారు. వ్యాయామం చేసేందుకు ఓపెన్ జిమ్ సైతం ఏర్పాటు చేయడంతో పెద్దలతో పాటు యువత కూడా నిత్యం సాధన చేస్తుంటారు.

షూటింగ్ స్పాట్

షార్ట్ ఫిలిమ్స్.. ఫోటో షూట్.. ప్రైవేటు ఆల్బమ్‌ల షూట్‌కు చందన చెరువు కేరాఫ్‌గా మారింది. చెరువును సుందరీకరించి పర్యాటకంగా అభివృద్ధి చేయడంతో స్థానిక యువతతో పాటు పరిసర ప్రాంతాల నుంచి యూట్యూబర్స్ సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా చందన చెరువును ఎంచుకుంటున్నారు. షార్ట్ ఫిలిమ్స్‌తో పాటు, ప్రైవేటు ఆల్బమ్స్ పాటలను ఇక్కడ చిత్రీకరిస్తున్నారు. వారాంతాల్లో అయితే పర్యాటకులు అధిక సంఖ్యలో సేదతీరేందుకు వస్తున్నారు.



స్పెషల్ అట్రాక్షన్

పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు పర్యాటకుల కోసం చెరువులో బతుకమ్మ ఘాట్, ఐలాండ్ నిర్మించారు. సాయంత్రం వేళ చాలా మంది ఇక్కడ సేదతీరేందుకు ఇష్టపడుతుంటారు. దీంతో పాటు బుద్ధ విగ్రహం, 75 మీటర్ల జాతీయ జెండా, మినీ ట్యాంక్‌బండ్, చెరువు కట్టపై జాతీయ నాయకుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



రోజూ వాకింగ్‌కు వస్తా

ప్రతిరోజు వాకింగ్ వస్తుంటాను. గతంలో చెరువు వద్ద అడుగు పెట్టలేని పరిస్థితి ఉండేది. అందరికీ ఉపయోగపడేలా చెరువును అభివృద్ధి చేసి అందుబాటులోకి తేవడం అభినందనీయం. వాకింగ్ చేసుకునేందుకు అనువుగా ఉండడంతో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వాకర్స్ వస్తున్నారు.

– నర్సింహగౌడ్, గాయత్రీనగర్



మినీ ట్యాంక్‌బండ్‌లా..

చెరువును మినీ ట్యాంక్‌బండ్‌లా అభివృద్ధి చేశారు. ఆహ్లాదంతో పాటు ఆరోగ్యం కోసం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్పొరేషన్ వారు ఎప్పటికప్పుడు నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు.

– సుదర్శన్, జిల్లెలగూడ



ఓపెన్ జిమ్‌లో స్థానికుల వ్యాయామం



ఐలాండ్‌లో యోగాసనాలు వేస్తున్న వాకర్స్



చిల్డ్రన్స్ పార్కు

హాయిగా.. జాలీగా

సెలవు రోజుల్లో చిన్నారులు ఆడుకునేందుకు ప్రత్యేకంగా చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో సాయంత్రం వేళ చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులతో సందడి వాతావరణం నెలకొంటోంది.



ఇటు హోం.. అటు పోస్టల్

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఓటింగ్ ప్రక్రియ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక





సీనియర్ సిటిజన్ ఇంటికి వెళ్లి ఓటు సేకరిస్తున్న కలెక్టర్ శశాంక, పక్కన పోస్టల్ ఓటు వేస్తున్న మహిళా ఉద్యోగి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటు ఫ్రం హోంప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హైదర్‌గూడ, అత్తాపూర్ వాసుదేవ్నగర్‌లో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు రిటర్నింగ్ అధికారి శశాంక సమక్షంలో ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియ 6వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రోజు చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 54 ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి నుంచే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడంతో సీనియర్ సిటిజన్లు, దివ్యంగులకు వెసులుబాటు లభించింది. మొత్తం 1,115 మంది ఓట్ ఫ్రమ్ హోం సదుపాయాన్ని వినియోగించుకోనుండగా, వీరిలో 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు 695 మంది, దివ్యాంగ ఓటర్లు 420 మంది ఉన్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. తప్పిదాలకు తావులేకుండా, నూటికి నూరు శాతం గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా హోం ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

రెండోరోజుకు చేరిన పోస్టల్ బ్యాలెట్

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. ఈ నెల 8 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే 23 వేల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోనున్నారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను రిటర్నింగ్ అధికారి శశాంక పరిశీలించారు. ఓటింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఓటింగ్ బాక్స్‌కు సీల్

ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా శనివారం రాజకీయ నాయకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక ఇటీపీబీఎస్ ఓటింగ్ బాక్స్‌కు సీల్ వేశారు. ఓటర్లు వారి ప్రస్తుత నివాస స్థలం నుంచి వారి ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడంపై ఎన్నికల సంఘం తన దృష్టిని కేంద్రీకరించిందని, ఈసీఐ బృందం అన్ని సామాజిక-ఆర్థిక వర్గాల్లో వలసదారుల ఎన్నికల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి సమగ్ర పరిష్కారాలను కనుగొనడానికి సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు.

విధులపై అవగాహన ఉండాలి

పోలింగ్ విధులపై పీఓ, ఏపీఓ, ఓపీఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. ఈ మేరకు శనివారం పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకెళ్లి..పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీఓ, ఏపీఓలదేనని చెప్పారు. పోలింగ్ డే రోజున పోల్ తర్వాత రిపోర్ట్ తయారు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

రేపు బీజేవైఎం యువ సమ్మేళనం



మాట్లాడుతున్న భగీరథ్

ఆమనగల్లు: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 6న కల్వకుర్తిలో బీజేవైఎం ఆధ్వర్యంలో యువ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి భగీరథ్ తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గ బీజేపీ అభ్యర్థి భరత్‌కు మద్దతుద్ధ్ యువసమ్మేళనం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున హాజరవ్వాలని కోరారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కండె సాయి, కల్వకుర్తి బీజేవైఎం ఇన్‌చార్జి పద్మఅనిల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు సందీప్, ధన్‌రాజ్, మహేశ్‌యాదవ్, అజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చేవెళ్ల: గుర్తు తెలియని వ్యక్తి పడుకున్న చోటే మృత్యుఒడికి చేరకున్నాడు. ఈ ఘటన చేవెళ్ల పోలీస్టేషన్ పరిధిలోని కుమ్మెర గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామ సమీపంలోని పొలాలకు వెళ్తున్న స్థానికులు చెట్టు కింద ఎవరో పడుకుని ఉండడాన్ని గుర్తించారు. పిలిచిన పలకకపోవడతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మతిస్థిమితం లేని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు. మృతుడిని గుర్తిస్తే సమాచారం చేవెళ్ల ఠాణాలో సంప్రదించాలన్నారు. పోలీసులు గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8వరకు పోస్టల్ ఓటు



ముందస్తు ఓటింగ్‌కు వచ్చిన ఉద్యోగులు

చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం



హోమ్ ఓటింగ్‌లో పోలింగ్ అధికారులు, పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ సాయిరాం

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజక వర్గం పరిధిలో హోమ్ ఓంటింగ్, పోస్టల్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతుందని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 15 మంది హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు వెల్లడించారు. ఈ నెల 8వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. హోమ్ ఓటింగ్‌కు నియోజకవర్గ పరిధి నుంచి 342 మంది వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ఎన్నికలకు సహకరించండి

చేవెళ్ల ఏసీపీ కిషన్



ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసులు

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్ ఫోర్స్ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చేవెళ్ల, షాబాద్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మారెడ్డి, కాంతారెడ్డి, ఎస్ఐలు ప్రదీప్‌కుమార్, వీరబ్రహ్మం, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ..

యువకుడి మృతి



సురేశ్ మృతదేహం

కొత్తూరు: గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా గ్రీపురం గ్రామానికి చెందిన సురేశ్(25) టైల్స్ వేస్తుంటాడు. ఆయన కుటుంబంతో కలిసి కొత్తూరులో నివసిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున తిమ్మాపూర్ గ్రామంలోని చేగూరు కూడలిలో జాతీయ రహదారిపై సురేశ్ ప్రయాణిస్తున్న బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడి తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారీగా నగదు తరలింపు

రూ.58.86లక్షలు సీజ్ చేసిన పోలీసులు



నగదు చూపుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: రశీదు లేకుండా తరలిస్తున్న నగదును శనివారం పోలీసులు సీజ్ చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో శ్రీశ్రీ ఏరోసిటీ సమీపంలో ఆదిబట్ల ఎస్ఐ వెంకటేశ్ తన సిబ్బందితో వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాడు. ఓ వాహనంలో భారీగా నోట్ల కట్టలు గుర్తించి లెక్కించగా రూ.58.86లక్షలున్నాయి. డబ్బు తరలిస్తున్న పల్లె శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకుని నగదును సీజ్ చేశారు. సీఎంఎస్ కంపెనీ నగదుగా గుర్తించిన పోలీసులు రసీదు లేకపోవడంతో సీజ్ చేశామన్నారు.

కారును తప్పించబోయి అదుపుతప్పిన బైక్


ద్విచక్ర వాహనదారుడు మృతి



వికాస్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: కారును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పడంతో ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రాంచందర్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామానికి చెందిన వికాస్‌రెడ్డి(36) బైక్‌పై షాద్‌నగర్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. హాజిపల్లి రోడ్డులో ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ రాంచందర్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కూతురు, కొడుకున్నారు. మృతుడి బంధువు హిమసాగర్ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి ఆస్పత్రికి చేరకుని సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



లక్ష్మారెడ్డి మృతదేహం

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండల పరిధిలోని మథనాపురం వద్ద హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. మాడ్గుల మండల కేంద్రానికి చెందిన బత్తుల లక్ష్మారెడ్డి(75) శనివారం తన సొంతూరుకు వెళ్లేందుకు చింతపల్లి మండలం మథనాపురం వద్ద రోడ్డు పక్కన నిల్చుండగా మల్లేపల్లి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఓట్ల కోసం మత రాజకీయాలు

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి, పార్టీ నేతలను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు

షాబాద్: ఓట్ల కోసం బీజేపీ మతాల మధ్య చిచ్చుపెడుతోందని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడం రంజిత్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం రోడ్‌షో, అనంతరం ఎంఎస్ గార్డెన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కృషి చేయకుండా ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీని రూ.10లక్షలకు పెంచిందన్నారు. మిగిలిన పథకాలన్నీ ఎన్నికల తరువాత అందరికీ అందుతాయన్నారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. పనిచేసే కార్యకర్తలకు గుర్తుంపు లభిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే పేదలకు శ్రీరామ రక్ష అని, రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కష్టపడి పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జి చింపుల సత్యనారాయణరెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ మాట్లాడుతూ.. మతోన్మాద ముసుగులో దేశాన్ని దోచుకుంటున్న పార్టీకి తగిన బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లింగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ శేఖర్, నాగర్‌కుంట మాజీ సర్పంచ్ జయమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అన్వర్, ఇబ్రహీంతో పాటు 200 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సీనియర్ నాయకులు నెంటూరి రవీందర్‌రెడ్డి, చల్లా మాధవరెడ్డి, వసంతం, చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మహిళ అధ్యక్షురాలు అశ్విని, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేష్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు మంగలి చెన్నయ్య, పామెన నర్సింహులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.